# మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి

**చెరువులో స్నానం చేయడానికి భయపడే జనానికి గజఈతగాడి కథెందుకు అని తమరడగొచ్చు, కాని అత్తెసరు గిన్నెడు అన్నం ఆరుగురికి సరిపోతున్న ఈ రోజులలో అప్పంభొట్లు ఆహార విశేషాలు నమ్మినా నమ్మకపోయినా తెలుసుకోవడం అవసరం.**

అప్పంభొట్లు పదహేనేళ్ళ వయసులో అమడ దూరాన వున్న ఓ పల్లెటూరికి పురిటి కబురు మోసుకెళ్లాడు. చూసావని సూరమ్మ మునిమనవడు పుట్టాడన్న వార్తవిని పొంగిపోయి ఆ సందెచీకట్లో కందిపచ్చడి నూరి అప్పంభొట్లుని భోజనానికి లెమ్మంది. వడ్డించిన మొదట వాయకే నూరిన కందిపచ్చడి సాంతం అయిపోగా, సూరమ్మ అటక మీంచి అవకాయ దించింది. నేతిగిన్నె కందిపచ్చడికే ఖాళీ అయిపోతే అవకాయలోకి మానె వడ్డించింది. మూడో కలుపుకి ఆవకాయ జాడీ అడుగంటగా, గోంగూర బాన ముందు పెట్టింది. బానలో గోంగూర అయితే కొంత మిగిలింది కాని, వండిన అన్నం పూర్తవడంతో, మళ్ళీ వండే వోపికలేని సూరమ్మ, మొహమాటం విడిచి ఇహ మజ్జిగ కలుపుకో అనేసింది. వండిన వంటంతా అప్పంభొట్లుకే వడ్డించిన సూరమ్మ మజ్జిగ తాగి పడుకుంటే నిద్ర పట్టలేదు. అర్థరాత్రివేళ ఇంట్లో ఏదో చప్పుడవుతుంటే దొంగలేమోనని దీపం పెద్దది చేసి "ఎవర్రా అక్కడ" అని కర్ర తీసికెళితే అక్కడ అప్పంభొట్లు గిన్నెల్లో ఏవన్నా మిగిలిపోయిందేమోనని వెతుక్కుంటూ కన్పించాడు.

సూరమ్మ "నువ్వొట్టా పిచ్చి సన్నాసీ! ఆకలేస్తోందిట్రా!" అని అప్పటికప్పుడు పొయ్యి రాజేసి, పిండి కలిపి రొట్టె ముక్కలు పోసిస్తే అవి తిన్న తర్వాత గురకపెట్టి నిద్రపోయాడు అప్పంభొట్లు.


మర్నాడు ఉదయం అప్పంభొట్లు ఆకలెరిగిన సూరమ్మ సోలెడు నెయ్యి పోయించుకుని, గొల్లని పిలిచి ఐదు సేర్లు పెరుగు తెప్పించి, మానెడు కండిపప్పు వండి, అటక మీద వూరగాయలన్నీ దింపి వేడి వేడిగా అన్నం వడ్డించింది. ఆవకాయ నిన్ననే పూర్తయింది కనుక మాగాయ, మెంతికాయ ముక్కల పచ్చడి పప్పులో ఒకదాని తర్వాతొకటి కలుపుతూ ఖాళీ చేశాడు అప్పంభొట్లు. ఆ తర్వాత చింతకాయ పచ్చడి మీదికి లంఘించి చింతగింజలు మాత్రం మిగిల్చాడు. ఆ పైన ఐదు సేర్ల పెరుగు కలిపి, అందులో నంజటానికి కారం పచ్చడి లేకపోతే, ఉట్టెనున్న ఉసిరికాయ కుండ దింపించి, చప్పగా వున్నా దాంతోనే సరిపెట్టుకుని భోజనం ముగించాడు. సంవత్సరానికి సరిపడ్డ వూరగాయలు ఒక్కరోజులో తుడిగి పెట్టుకుపోతే పోయాయిగాని 'పిల్లడు కడుపు నిండా భోంచేశాడు' అని తృప్తిపడింది సూరమ్మ.

అప్పంభొట్లు భుక్తాయాసం తీర్చుకుని నాల్గంటలవేళ బయలుదేరి తిరిగి అమరావతి కొస్తుంటే వూరుకు ముందు డొంకలో సుబ్బయ్యగారు కంగారుపడ్తూ కన్పించారు. 'ఏవిటా కంగారు' అని అప్పంభొట్లుఅడగ్గా "ఐదుబస్తాలజొన్నలువున్నాయి. బండిమీదేసు కెళ్లాలి, ఎడ్లని తోలుకురారా అంటే పాలేరు ఇంకా రాలేదు. వర్షమొచ్చేట్లుంది" అన్నారాయన. 'ఓస్! ఇంతేనా!' అని అప్పంభొట్లు ఉత్తరీయం నడుంకి బిగించి సరాసరి బండి దగ్గరకెళ్ళి కాడెత్తి భుజం మీదేసుకుని సర్ సర్న వూళ్ళోకి లాక్కొచ్చి ఆ ఐదు బస్తాల జొన్నలు అలవోకగా సుబ్బయ్యగారి వరండాలో పడేసి చేతులు దులుపుకు ఇంటికి పోయారు.

కొంత కాలం తర్వాత సుబ్బయ్యగారు అప్పంభొట్లు తరపున పందెం కట్టాడు. రెండొందల ఆవడలు తింటాడు అని పందెం. గుళ్ళో మంటపంలో ఏర్పాటు చేశారు. జనం అబ్బురంగా రాసాగారు. పొద్దుట్నుంచి గారెలు వండి పెరుగులో వేస్తున్నారు. నాలుగు బానల పెరుగు తెప్పించారు. ఆవడంటే ఇప్పటి కాలం ఆవడా? ఒక్కొక్క ఆవడ దోసెడు వెడల్పు, రెండు అరచేతుల మందం. నాల్గుంటల్ల వేళ అప్పంభొట్లు స్నానం చేసి మంటపం దగ్గర కొచ్చేసరికి జనమంతా గుమిగూడి వున్నారు. మంటపం మధ్యన బాసీపట్టు వేసుకొని పక్కకు చూస్తే నాలుగు గంగాళాలలో మెంతిపెరుగులో తేలుతున్న ఆవడలు కన్పించాయి. వాటి మీద తిగరమోత మిరపకాయలు, కరివేపాకు, కొత్తిమెర నోట నీళ్ళూరిస్తుంటే 'ఇంకెందుకు ఆలస్యం?' అన్నాడు అప్పంభొట్లు.



డిగిన విస్తరి పరిచి వరసగా వడ్డించటమేమిటి, పదేసి ఆవడ వడ్డిస్తుంటే నాలుగు మిషాలలో విస్తరి ఖాళీ అవుతోంది. విస్తళ్ళు కడిగి ఇచ్చేవాళ్ళు, వడ్డించేవాళ్ళదేస్య ఆలమా అనిపిస్తోంది. మధ్యమధ్యన గొంతు జారటానికి మంచితీర్థం పుచ్చుకుంటూ చూసేంతలోనే నాలుగు గంగాళాలలో వున్న రెండొందల ఆవడ మెంతిపెరుగుతో సహా అవలీలగా ఖాళీ చేశాడు. జనం ఆశ్చర్యపోయారు. అంతతో అపలేదు. ఖాళీ విస్తరి చూపిస్తూ 'ఇంకా వున్నాయా?' అనడిగాడు. వంటమనిషి వచ్చిన జనానికి తలో ముక్కా ఇవ్వొచ్చని ఓ యాభై ఆవడ వేసి వేరే గంగాళంలో పెట్టాడు. అది కూడా తెప్పించి పూర్తిచేసి బ్రేవ్‌మని తేన్చుకుంటూ లేచి వెళ్ళిపోయాడు అప్పంభొట్లు. జనం ముక్కున వేలేసుకుని 'పీడు హరించుకోలేదు చస్తాడు' అనుకున్నారు. అప్పంభొట్లు పార తీసుకుని సరాసరి కృష్ణకెళ్ళి అవతలొడ్డుకు ఈదుకుంటూ పోయి పారతో ఇసక




తవ్వడం మొదలెట్టాడు. అలా రెండు గంటలు ఇసక తవ్వీ తవ్వీ స్నానం చేసి ఇంటికొచ్చి రాత్రికి శుభ్రంగా భోంచేసి పడుకున్నాడు.

పెళ్ళి భోజనాలలో తలుపు వారగా కూర్చునేవాడు అప్పంభొట్లు. స్వయంగా వెళ్ళి మూడు విస్తళ్ళు కలిపి కుట్టుకుని తెచ్చి వేసుకునేవాడు. గోకర్ణంతో పప్పుతెచ్చిగరిటెతో వడ్డించబోతే "వెధవ గరిటలు తీసెయ్!" అని గోకర్ణం వొంపించేవాడు. నేతి ఝూడీతో నెయ్యి వడ్డిస్తుంటే వేళ్ళ సందున ఎన్ని లోయలుండేవో తెలియదు. చేతిలో నెయ్యి కన్పించేది కాదు. ఝూడీ ఖాళీ అవవలసిందే. కూరల పళ్ళాలు, పప్పు గిన్నెలు, పులిహోర పళ్ళాలు, పులుసు బకెట్లు అన్నీ అప్పంభొట్లు దాకా వచ్చి ఖాళీ అయి వెనక్కు వెళ్ళవలసిందే. ఆఖర్న లడ్డూల బుట్ట వస్తే గాలికోసం "ఉస్" అన్నట్టు ఎంగిలి వెయ్యి జాడించి, ఆ చెయ్యి బుట్టకు తగలగా 'అంటయింది ఇంకెందుకు పనికొస్తాయి' అని బుట్టెడు లడ్లు విస్తట్లో వొంపించుకునేవాడు.

అలా సాగిపోయిన అప్పంభొట్ల ఆఖరి దశలో కరువొచ్చింది. పెద్దవాడైనా, జఠరాగ్ని తగ్గినా జిహ్వ చావలేదు. "మూడు వీశెల వంకాయ కొని ముప్పొంకాయ కూర చేయించి, అరసోలెడు నెయ్యి వడ్డించగా నేను భోంచేస్తుంటే చూసి వినోదించేవారు శోభనాద్రిగారు. ఇప్పుడా సదుపాయం ఏదీ?" అని విచారించేవాడు. పోతూపోతూ అప్పంభొట్లు కొడుకుని పిలిచి చెప్పాడు. "పేరయ్యా నా తద్దినానికి మంచి తిండిపుష్టి ఉన్నవాణ్ణి భోజనానికి పిలవరా!"

అప్పంభొట్లు పోయిం తర్వాత పేరయ్యకి తండ్రిలాంటి తిండిపుష్టి వున్నవాడు కన్పించలేదు. వున్నా అలా పెట్టగల తాహతూ కుదరలేదు. అతని మనవలకీ, మునిమనవలకీ అప్పంభొట్ల అహార లీలలు చెప్పకోవడమే మిగిలింది.